క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దముడియం : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో షంషాద్‌భాను తెలిపారు. 60 శాతం సబ్సిడీతో బ్యాంకు లోన్లు ఇస్తారన్నారు. పెద్దముడియం, పెద్దపసుపుల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌కు ఒక యూనిట్ చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. వచ్చే నెల 10వ తేదీ లోపల ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు, కులధృవీకరణ పత్రం, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబర్, తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆర్థిక సాయం



నగదును అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పులివెందుల రూరల్ : వెంకటాపురం గ్రామానికి చెందిన నిరంజన్ ఫిబ్రవరి 27న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న 1996–97 బ్యాచ్ రవీంద్రనాథ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు, అలాగే 1997–99 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు, 1999–2022 బ్యాచ్ డీగ్రి కళాశాల చదివిన విద్యార్థులు కలిసి రూ. 1.80 లక్షలను నిరంజన్ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

మానవత్వం చాటుకున్న మేఐహెల్ప్‌యూ సంస్థ



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మేఐహెల్ప్‌యూ సంస్థ ప్రతినిధులు

జమ్మలమడుగు : అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటుంది మేఐ హెల్ప్‌యూ సంస్థ. ఆదివారం హోటల్‌లో పనిచేసే ఓబులేసు(50) అనారోగ్యంతో మరణించాడు. ఓబులేసు అంత్యక్రియలు నిర్వహించటానికి బంధువులు, హోటల్ యజమానులు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో వారు మేఐహెల్ప్‌యూ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించారు. చైర్మన్ లక్ష్మన్‌మోరె , అహమ్మద్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

విజయోత్సవ ర్యాలీ



ఎస్సీవర్గీకరణ విజయోత్సవ ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జమ్మలమడుగు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డినెన్స్ జారీ చేసి ఎస్సీ వర్గీకరణ చేయడం కోసం కృషి చేయడంతో పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ మూడు దశాబ్దాలుగా మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిరంతర పోరాటం చేయడంతోనే నేడు నెరవేరబోతుందని ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పిచుక బాబు తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో చిన్నయ్య మాదిగ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.


కుంకుమ బండి ప్రదర్శన



కుంకుమ బండిని ఊరేగిస్తున్న భక్తులు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరులో ఆదివారం అంకాలమ్మ తిరునాలను పురస్కరించుకుని కడపనాగయ్యపల్లెకు చెందిన గ్రామస్తులు ఇంటికి ఒక పట్టు చీర దాదాపు 108 సేకరించి భక్తిశ్రద్ధలతో కుంకుమ బండిని అలంకరించి ఊరేగింపుగా అమ్మవారి గుడి వద్దకు ప్రదర్శన నిర్వహించారు. రెండవ వారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందకు భారీగా తరలివచ్చారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే ఆలయ సమీపంలోని వీరభద్ర స్వామి, శివాలయం, ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు.

ఉపాధికూలీలపై నిర్లక్ష్యమా..

- ప్రభుత్వం పెంచిన క్యూబిక్ మీటరు రేటు అమలు కాని వైనం
- కొందరికి మాత్రమే పనులు
- 10 వారాలకు సంబంధించి కూలీలకు జమ కాని డబ్బు
- ఉపాధి హామీ అధికారుల తీరుపై కూలీల పెదవి విరుపు



చక్రాయిపేటలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

చక్రాయపేట : తమ పట్ల కోపమో లేక నిర్లక్ష్యమో కాని అధికారుల తీరు మాత్రం అర్థం కావడంలేదని ఉపాధి కూలీలు మండి పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో కొందరికే పనులు చూపుతూ మరి కొందరి గురించి పట్టించుకోవడం లేదనే అపవాదును అధికారులు మూట కట్టుకుంటున్నారు. మరి కొన్ని గ్రామాల్లో పనులే పెట్టక పోవడంతో కూలీలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు డ్వామా పీడీకి చెప్పుకున్నా ఆయన ఆదేశించినా ఇక్కడి ఉపాధి సిబ్బంది ఇదంతా మామూలే అన్నట్లు లెక్క పెట్టలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెంచిన మేరకు మీకు కూలీ పడాలి అంటే ఖచ్చితంగా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పనులు చేయాల్సిందే నని చెప్పే అధికారులు అదే ప్రభుత్వం పెంచిన క్యూబిక్ మీటరు రేటును ఎందుకు అమలు లోకి తీసుకురాలేక పోతున్నారని కూలీల నుంచి ఎదురు ప్రశ్న వినిపిస్తోంది. మరో వైపు వర్షాలు లేక గుంతలు తవ్వాలంటే నేల గట్టిగా ఉండటం వల్ల చేతులకు బొబ్బలు వస్తున్నా అధికారులకు కనికరం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము చేసిన పనులకు 10 వారాలుగా కూలీ డబ్బులు పడకపోవడంతో ఏమి తినాలో అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పెంచిన క్యూబిక్ రేటును ఇక్కడి అధికారులు అమలు చేయక పోవడంతో ఎవరైనా ప్రశ్నిస్తే ఇవన్నీ పాత పనులు కూలీ రూ.300 పడేలా పని చేయండి చాలు అంటున్నారని గట్టిగా అడిగితే మీకు పనులు ఉండవు అని బెదిరిస్తున్నట్లు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మీకు కూలీ రూ.300 పడాలంటే 1.25 క్యూబిక్ మీటర్ల మేర తవ్వితేనే మీకు ఆడబ్బు పడుతుంది. అవగాహన కలిగిన వారు గతంలో క్యూబిక్ మీటరుకు రూ.272లు ఉండేదని ఇప్పుడు క్యూబిక్ మీటరు ధర ఎంత అని అడిగితే సరైన సమాధానం చెప్పకుండా దాటేస్తున్నారని కల్లూరుపల్లె గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు అంటున్నారు. కొంద రైతే కూలీ గిట్టు బాటు కాదని నేల గట్టిగా ఉండటంతో బిందెలతో నీళ్లు మోసుకెళ్లి చల్లుకుంటూ పనులు చేస్తున్నా సరైన కూలీ పడటం లేదని డ్వామా పీడికి మొరపెట్టుకున్నట్లు సమాచారం. దీంతో పీడీ అందరికీ పనులు పెట్టాలని ఇక్కడి సిబ్బందిని ఆదేశించినా వారు లెక్క పెట్టలేదని పనులు దక్కని కూలీలు మండిపడుతున్నారు.

నీడా కరువే

గతంలో ఉపాధి కూలీలు వేసవిలో కాసేపు సేద తీరడానికి నీడ కోసం పట్టలు ఇచ్చేవారు. అలాగే తాగు నీటిని అందించేందుకు ఒక కూలీని ప్రత్యేకంగా నియమించే వారు అలాంటిది నేడు నీడ లేదు నీరు లేదని కూలీలు అంటున్నారు. ఇంటి వద్ద ఎవరూ లేని వారు చంటి బిడ్డలను పనుల వద్దకు తీసుకెళ్లి ఎండలో పడుకో బెట్టాల్సి వస్తోందని చంటి బిడ్డల తల్లులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తమకు కూలీ డబ్బులు సత్వరమే జమ చేయించడమే కాకుండా, అందరికీ పనులు కల్పించి గిట్టుబాటు కూలీ పడేలా చూడాలని కోరుతున్నారు.

గడ్డ పారతో ఎంత తవ్వినా చిన్న పేడు కూడా రాదు



ఎండలకు గడ్డపారతో ఎంత గట్టిగా తవ్వినా చిన్న పేడు కూడా రాదు. నీల్లు చల్లుకుందా మంటే కను చూపు దూరంలో ఎక్కడా లేవు. ఇంటి వద్ద నుంచి బిందెలతో తీసుకెళ్దామంటే ఊర్లల్లోనూ నీళ్ల రాక ఇబ్బందులు పడుతున్నాం. ఇంత చేసినా కూలీ డబ్బులు పడలేదు.

– పారి ఆంజనేయులు, ఉపాధి కూలీ, చిలేకాంపల్లె దళితవాడ

రెండు నెలలుగా కూలీ డబ్బులు రాలేదు



చేతులు బొబ్బలు వచ్చేలా పనులు చేసినా రెండు నెలలుగా కూలీ డబ్బులు పడలేదు. ఇలా అయితే ఏమి తినాలి. ఎండకు అవస్థలు పడి పనులు చేసేది కూలీ డబ్బు వస్తుందనే కదా. ఆడబ్బే ఆలస్యం చేస్తే ఎట్లా మరి. దీనికి తోడు నీడ, నీళ్ల వసతి కూడా కూలీలకు కల్పించాలి.

– బుజ్జిలయ్య, గండికొవ్వూరు దళితవాడ

ర్యాలీని విజయవంతం చేయండి

పులివెందుల టౌన్ : వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈనెల 21వ తేదీన శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, ముస్లిం మైనార్టీ నాయకుడు నూరుల్లా, ముస్లిం మైనార్టీ సేవ కమిటీ అధ్యక్షుడు గౌస్‌పీర్‌లు తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక జామియతుల్ అన్సర్ మసీదులో మైనార్టీ సేవ కమిటీ వారి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు సమావేశమై మాట్లాడారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి మక్కా మసీదు, వైఎస్సార్ సర్కిల్ మీదుగా తహసీల్దార్ ఆఫీసు వరకు ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చండి



ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

చింతకొమ్మదిన్నె : కడప–చిత్తూరు జాతీయ రహదారిపై ఊటుకూరు సమీపంలోని టర్నింగ్ పాయింట్ కోచింగ్ సెంటర్ ఎదురుగా రహదారిపై ఎయిర్‌టెల్ ఫైబర్ కేబుల్ నిర్మాణానికి సంబంధించి పెద్ద గుంతను తీశారు. కానీ పూర్తిగా పుడ్చకుండా వదిలి వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు గుంతను పుడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

జాతరలో నాయకులు



సంబటూరులో జరిగిన జాతరలో పాల్గొన్న నాయకులు

కమలాపురం : మండలంలోని సంబటూరులో జరిగిన గంగమ్మ జాతరకు నాయకులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఆదివారం వైఎస్సార్ మాజీ స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆహ్వానం మేరకు గ్రామానికి విచ్చేసిన నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, సుధీర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ రామ గోవిందురెడ్డి, భైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రరెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం విందులో పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో దేవర సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకరరెడ్డి ఆహ్వానం మేరకు ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, స్థానిక పార్టీ నాయకులతో కలిసి విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్

పులివెందుల టౌన్ : ఈస్టర్‌ను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ ఫాదర్ ఆనందబాబు యేసు క్రీస్తు గురించి వివరిస్తూ ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరు సన్మార్గంలో పయనించి యేసుక్రీస్తు కృపను పొందాలన్నారు. అలాగే పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, రాక్‌చర్చి, బేతేలు చర్చి, సాలేము ప్రార్థనా మందిరం, క్యాథలిక్, హోసన్న తదితర ప్రార్థన మందిరాల్లో క్రైస్తవ సోదరులు, సోదరీమనులు ఉపవాసదీక్షలు విరమించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. బంధుమిత్రులను తమ ఇళ్లకు పిలిచి విందులు ఏర్పాటు చేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని క్రైస్తవ మందిరాల్లో ఈస్టర్ వేడుకలను క్రిష్టియన్స్ ఘనంగా నిర్వహించారు. ఆదివారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం యువకులు వసంతం చల్లుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.

మురికి కూపాన్ని తొలగించండి



టీడీపీ నాయకులను నిలదీస్తున్న మహిళలు

వేంపల్లె : పట్టణంలోని శ్రీరాంనగర్ ప్రాంతంలోని కాలేజీ రోడ్డులో ఉన్న మురికి కూపాన్ని తొలగించాలని అ ప్రాంత మహిళలు టీడీపీ నేతలను నిలదీశారు. ఆదివారం టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డిలు శ్రీరాంనగర్ ప్రాంతంలో పర్యటించడం జరిగింది. ఈ నేపథ్యంలో కాలేజీ రోడ్డులోని గంగమ్మ గుడి సమీపంలో ఉన్న మహిళలు మూకుమ్మడిగా వారిని చుట్టు ముట్టి మురికి సమస్యను వారి దృష్టికి తెచ్చారు. 3 నెలల నుండి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి వ్యాధులు సోకుతున్నాయని వాపోయారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలకు వెళ్లే రహదారిలో మురికి నీరు నిల్వ ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల్లోగా రోడ్డుపై మురుగు నీరు నిల్వ లేకుండా చేయిస్తానని హామీ ఇచ్చారు.

జేఎన్‌టీయూలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2కె25 పేరిట ఈసీఈ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పూర్వ విద్యార్థులు మధ్య సంబంధాలను బలపరుస్తాయన్నారు. ఈసీఈ డిపార్ట్ మెంట్ హెచ్ఓడీ షేక్ తాజ్ మహబూబ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు కళాశాల అభివృద్ధికి తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వరమ్మ, ప్రొఫెసర్లు , అధ్యాపకులు పాల్గొన్నారు.

అచ్చివెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అచ్చివెళ్లి గంగమ్మ

పులివెందుల రూరల్ : అచ్చివెల్లి గ్రామ సమీపంలో ఉన్న అచ్చివెళ్లిగంగమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మతల్లిగా అచ్చివెళ్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధిగాంచింది. అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తుల పేరు మీద అభిషేకాలు, అర్చనలు చేసిన అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు.

ప్యాసింజర్ రైళ్లను ఆపాలని వినతి



రైల్వే ఏడీఆర్ఎం వినతిపత్రం అందిజేస్తున్న ఏపీడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : కమలాపురంలో గతంలో లాగ అన్ని ప్యాసింజర్ రైళ్లను ఆపాలని ఏపీ డబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ తెలిపారు. ఆదివారం ఎర్రగుంట్లలోని రైల్వే రన్నింగ్ రూంను పరిశీలించడానికి వచ్చిన ఏడీఆర్ఎం సుధాకర్‌ను కలసి మీడియా ప్రతినిధులు సంయుక్తంగా వినతిపత్రం అందజేశారు. కమలాపురం రైల్వేస్టేషన్ నుంచి మైదుకూరు, ఖాజీపేట, వీరపునాయునిపల్లె, వల్లూరు మండలాలకు ఇక్కడి నుంచి ప్రయాణిస్తుంటారన్నారు. తిరుపతి, హైదరాబాదుకు విద్య వైద్యానికి రైళ్లల్లో ప్రయానించే వారు ఉన్నారన్నారు. కరోనా సమయంలో రైళ్లను రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అన్ని ప్యాసింజర్ రైళ్లను ఆపాలని ఆయన కోరారు. స్పందించిన ఏడీఆర్ఎం సుధాకర్ మాట్లాడుతూ రైళ్ల నిలుపుదలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యవసర సరుకులను అందిస్తున్న కోలా ప్రసాద్

పులివెందుల టౌన్ : ఈస్టర్ పర్వదినాన్ని పురష్కరించుకుని ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఆదివారం దివ్యాంగులకు దళిత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, కోలా ఫౌండేషన్ చైర్మన్ కోలాప్రసాద్ దివ్యాంగులకు నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో జీసస్ ఛారిటీస్ ఫాస్టర్ మృత్యుంజయం హాజరై మాట్లాడుతూ దివ్యాంగులకు నిత్యవసర సరుకులను అందించినందుకు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రిష్టియన్‌లైన్ అంబేద్కర్ దళిత సంఘం నాయకులు అశోక్, వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, కోలాఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



శ్రీకృష్ణుడు, గోపికల నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక ఉలిమెల్లరోడ్డులోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి కళాతరంగిణి రాజేష్‌బాబు కళాబృందం చిన్నారులచే శాస్త్రీయ, జానపద, సినీ నృత్యప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

ఏమి హాయిలే ఇలా..



కాలువలో ఈత కొడుతున్న పిల్లలు, పెద్దలు

పులివెందుల రూరల్ : ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందేందుకు పిల్లలు, పెద్దలు, వృద్ధులు సైతం కాలువలో ఈత కొడుతున్నారు. వేసవికాలంలో పాఠశాలలు, కాలేజీలు, సెలవులు రావడంతో పిల్లలు కాలువ నీటిలో కేరింతలు కొడుతున్నారు. మరి కొంతమంది పెద్దలు వారి పిల్లలకు ఈత నేర్పించేందుకు మునగబెండులు, వాటర్ క్యాన్లు, ట్యూబులు ఉపయోగిస్తూ పిల్లలకు ఈత నేర్పిస్తున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలలో బావులలో ఎక్కడ చూసినా కూడా నీరు ఉండేవి. కాలక్రమేనా వర్షాలు పడకపోవడంతో ఆ బావులు కనుమరుగైపోయాయి.

అరుళయ్య సేవలు ఆదర్శనీయం

కడప కల్చరల్ : బిషప్ అరుళయ్య చేసిన సేవలు జిల్లా క్రైస్తవ లోకానికి ఆదర్శంగా నిలిచాయని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ అన్నారు. ఆదివారం అరుళయ్య 48వ బిషప్ పట్టాభిషేక వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల అలంకరించారు.

పోరాటాల ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో నిరుద్యోగులు ఐక్యంగా అనేక పోరాటాలు చేయడం ద్వారానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సాధ్యం అయిందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు సంబంధించి భవిష్యత్తులో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో 30వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా కేవలం 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు.

వైభవంగా జ్యోతి మహోత్సవం

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లెలో శనివారం అర్ధరాత్రి వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం నిర్వహించారు. జ్యోతులు దేదీప్యమానంగా వెలుగొందాయి. ఈ మహోత్సవంలో తొగటవీర క్షత్రియులు చేసిన విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు జ్యోతులు తలపై పెట్టుకుని భక్తిపాటలు పాడుకుంటూ మేళతాళాలతో మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ జ్యోతి ఉత్సవాల్లో మండలంలోని పలు గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించండి

పోరుమామిళ్ల : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ బృందం ఆదివారం గ్రామాల్లో ప్రచారం చేపట్టింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య ఆధ్వర్యంలో చిన్నాయపల్లె, సిద్ధవరం, అగ్రహారం గ్రామాల్లో తల్లిదండ్రులను, పిల్లలను సమావేశపరచి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. ఉచిత విద్య, మధ్యాహ్న భోజనము, యూనిఫామ్, బూట్లు, సాక్స్, పుస్తకాలు ప్రభుత్వ బడుల్లోనే అందుతాయన్నారు. ప్రైవేటు పాఠశాలల మోజుతో ఆర్థికంగా భారం మోయవద్దని హెచ్చరించారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



వేంపల్లె : అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కమలాపురంలో అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ జనార్ధన్‌రెడ్డి



జమ్మలమడుగు :అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పులివెందుల : అవగాహణ కల్పిస్తున్న అధికారి సునిల్‌కుమార్

కమలాపురం : మండలంలో ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న అగ్ని మాపక వారోత్సవాలు ఆదివారం ముగిసాయి. చివరి రోజు అగ్ని మాపక కార్యాలయంలో స్థానిక ప్రజలకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని ఎలా ఆర్పాలి అనే అంశాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే 08563 274250, 101కు డయల్ చేయాలన్నారు. అనంతరం అగ్ని మాపక యంత్రాల ప్రదర్శన నిర్వహించారు. అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు మాట్లాడుతూ అగ్ని మాపక అధికారులు సూచించిన జాగ్రత్తలను పాటించి అగ్ని ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వేంపల్లె అగ్నిమాపక కేంద్రాధికారి శివరామిరెడ్డి ఆధ్వర్యంలో 7వ రోజు ఆదివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురుకుల పాఠశాల మైనారిటీ బాలికలు ప్రిన్సిపాల్ సుగుణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక పరికరాలు గురించి, అవి ఏవిధంగా ఉపయోగపడతాయి అనే విషయాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్మెన్లు రామకృష్ణ, హరిబాబు, డ్రైవర్ ఆపరేటర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 101, వేంపల్లె ఫైర్ స్టేషన్ ఫోన్ నెంబర్ 9441768101 కు కాల్ చేసి తెలపాలని సూచించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏలా ఆరికట్టాలనే దానిపై అగ్నిమాపక శాఖ అధికారి సత్యంరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం ముద్దనూరు రహదారిలో ఉన్న అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. వెటర్నరీ సూపరింటెండెంట్ వి.విజయశేఖర్ హాజరై మాట్లాడారు. ప్రజలు నిద్రించు సమయంలో తప్పనిసరిగా గ్యాస్ సిలిండర్‌కు ఉన్న రెగ్యులేటర్ ఆఫ్‌చేసి పడుకోవాలని ఆయన సూచించారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఫైర్ స్టేషన్ అధికారి సునిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న ఫైర్ స్టేషన్‌లో పొదుపు సంఘాల మహిళలకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.